# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉపయోగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్రంలో అంకుర సంస్థలు ఏర్పాటు చేసే వారికి 25 లక్షల రూపాయల వరకూ ఆర్థిక ప్రోత్సాహకాలు అందించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాన్ ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు.
- శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం వెళ్లే భక్తుల రద్దీ దృష్ట్యా భారతీయ రైల్వే 62 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది.
- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ రేపు మరింత బలపడి తుఫానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==================

రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉపయోగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ఈరోజు రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు మాట్లాడారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను ఊహించి రాజ్యాంగాన్ని రచించారని.. రాజ్యాంగ పరిషత్‌లో తెలుగు వాళ్లు ప్రధాన పాత్ర పోషించారని వ్యాఖ్యానించారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందాలనేది రాజ్యాంగ లక్ష్యమని ఓటు హక్కు ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోగలుగుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

==================

నూతన ఐటీ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఐటీ సంస్థలు, ఐటీ డెవలపర్లకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలపై ఈ సమీక్షలో చర్చించారు. 2029 నాటికి రాష్ట్రంలో 5 లక్షల వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కో-వర్కింగ్ స్పేస్‌లు, కార్యాలయ సముదాయాల నిర్మాణానికి అవసరమైన భూములు రాయితీపై లీజుకివ్వడం, సింగిల్ విండో విధానంలో మౌలిక వసతుల కల్పనకు అనుమతులు ఇవ్వడం, ఐటీ సంస్థలను ఇండస్ట్రియల్ పవర్ టారిఫ్ పరిధిలోకి తీసుకురావడం వంటి అంశాలపై ముఖ్యమంత్రి  అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంకుర సంస్థలు ఏర్పాటు చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు 25 లక్షల రూపాయల వరకూ ఆర్థిక ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.

==================

రాజ్యసభలో ఇటీవల ఖాళీ అయిన 6 స్థానాల ఉపఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లో మూడు, ఒడిశా, బెంగాల్, హరియాణా రాష్ట్రాల్లో ఒక్కో స్థానానికి డిసెంబర్ 20న ఉప ఎన్నిక జరగనుంది. డిసెంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల స్వీకరణకు డిసెంబర్ 10న తుది గడువు కాగా  డిసెంబర్ 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు ఉపసంహరణకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. డిసెంబర్ 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్.. అదే రోజు 5 గంటల నుంచి లెక్కింపు ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్యల రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యమయింది.

==================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం గత 6 గంటల్లో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ.. తీవ్ర అల్పపీడనంగా బలపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ రేపు మరింత బలపడి తుఫానుగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత రెండు రోజుల్లో శ్రీలంక తీరాన్ని దాటి తమిళనాడు తీరం వైపు ఉత్తర వాయవ్య దిశగా పయనించనుందని పేర్కొంది. దీని ప్రభావంతో రాబోయే 4 రోజుల్లో  కోస్తాంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో  భారీ నుంచి  అతిభారీ వర్షాలు మిగిలిన చోట్ల విస్తృతంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాల నేపధ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

విరామం

==================

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను కలిసిన పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక విశ్వవిద్యాలయం సహా 7 అంశాలపై చర్చించామని పాత్రికేయులకు తెలిపారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్పీ)పై చర్చించారు. ఆసియాన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ అందిస్తున్న ముందస్తు నగదు పంపిణీ విధానాన్ని కొనసాగించాలని ప్రాజెక్టు కాలవ్యవధిని 2026 డిసెంబర్ వరకు పొడిగించాలని ఈ సందర్భంగా కోరారు. ఆదే విధంగా ఈరోజు కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌తో కూడా పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ రక్షిత మంచినీరు ఇవ్వాలనేది ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్రానికి జల్ జీవన్ మిషన్ నిధులను పెంచాలని కేంద్ర మంత్రిని కోరామని పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.....

(వాయిస్ 34 సెకన్లు)

===================

శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం వెళ్లే భక్తుల రద్దీ దృష్ట్యా భారతీయ రైల్వే 62 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. డిసెంబర్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 27వ తేదీ వరకూ ఈ ప్రత్యేక రైళ్లు భక్తులకు అందుబాటులో ఉంటాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే విశాఖపట్నం – కొల్లాం మధ్య ప్రతి బుధవారం ప్రత్యేక రైలును నడుపుతోంది. విశాఖపట్నంలో ఉదయం 8 గంటల 20 నిమిషాలకు  బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటల 55 నిమిషాలకు కొల్లాంకు చేరుతుంది. తిరుగు పయనంలో కొల్లాం నుంచి ప్రతి గురువారం రాత్రి 7 గంటల 35 నిమిషాలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11 గంటల 20 నిమిషాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్ చేరుతుంది. డిసెంబర్ 5 నుంచి ఫిబ్రవరి 27 వరకూ ప్రతి గురువారం ఆ సర్వీసు అందుబాటులో ఉండనుందని అధికారులు వెల్లడించారు.

అదేవిధంగా శ్రీకాకుళం నుంచి కొల్లాం మధ్య 18 ప్రత్యేక రైళ్లను కూడా అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 1 నుంచి జనవరి 27 వరకు శ్రీకాకుళం నుంచి కొల్లాంకు ప్రత్యేక రైలు నడపనున్నారు. ఈ రైలు ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు శ్రీకాకుళం నుంచి బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు కొల్లాం చేరుతుందని, శబరిమల వెళ్లే భక్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

===================

రాష్ట్ర రాజధాని అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనం నిర్మించాలని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. యువత భవిష్యత్ అంతా డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి నూతన సాంకేతికతలపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. గ్రామాల్లో యువత అధిక సంఖ్యలో ఉన్నారని, సరైన నైపుణ్యం లేకపోవడంతో రాణించలేకపోతున్నారని, ఆ మేరకు వారిలో నైపుణ్యం పెంపొందించాల్సిన అవసరం  ఉందన్నారు. ప్రతి నెలా నూతన ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు.

===================

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైలు నెంబర్ 12709 గూడూర్ సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ ఈరోజు సాయంత్రం 6 గంటల 40 నిమషాలకు గూడూర్ లో బయల్దేరవలసి ఉండగా దాని జత రైలు ఆలస్యంగా నడుస్తున్న కారనంగా దీనిని రాత్రి 8 గంటల 40 నిమషాలకు మార్పు చేశామని రైల్వే అధికారులు తెలిపారు.

===================

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి తెలిపారు. వచ్చే సంవత్సరం జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనానికి అవకాశం కల్పిస్తామని ఆయన తెలియజేశారు. ఈ సమయంలో వీఐపీ ప్రొటోకాల్ దర్శనాలు మినహా చిన్న పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్మీ, ఎన్ఆర్ఐల దర్శనాలు, ఇతర ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

===================
===================